ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి

మహబూబాబాద్
శుక్రవారం 8 నవంబరు 2024





నెల రోజులైనా గింజ కూడా

## కొనుగోలు చేయలే

- కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో రైతులను ఆగం చేస్తోంది
- నమ్మకం లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

6

కల్లంలో ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## పేదల బియ్యం పక్కదారి!



- నర్సింహులపేట మండలంలో యథేచ్ఛగా దందా
- రేషన్ దుకాణాల నుంచి బ్లాక్, మార్కెట్‌కు తరలుతున్న వైనం
- నెలకు వెయ్యి క్వింటాళ్ల వరకు వ్యాపారుల పాలు
- చక్రం తిప్పుతున్న ఓ అధికారి?
- డీలర్లు, అధికారులకు కాసుల వర్షం

6

కేసముద్రంలో విభజన అంశంపై ఇఫ్టూ కార్మిక సంఘంలో అంతర్గత చర్చలు



- మార్కెట్, మిల్లు కార్మికులుగా బైఫర్‌కేషన్
- మళ్లీ తెరపైకి 'విభజన' అంశం
- నేడు పాలకమండలి మరోసారి చర్చలు
- కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో పని చేస్తున్న 450 మంది లేబర్స్
- అనంతరం ఏర్పడే సవాళ్లెన్నో..

# కొలిక్కి వచ్చేనా?

కేసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రముఖమైన కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో కార్మికుల విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కొన్నేళ్ల క్రితం పలుమార్లు ఈ అంశాన్ని ప్రయత్నించి, విఫలంకావడంతో తాజా ఈ సమస్య పరిష్కారం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ పరిధిలో 76 వ్యాపార సంస్థలు నమోదై ఉండగా, వీటికింద 450 మంది కార్మికులు మార్కెట్ లైసెన్సులను జారీ చేసింది. అయితే ఇటీవలె హమాలీ, దడువాయిలకు కూలిరేట్లను మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పెంచి, కూలీలకు మాత్రం పెంచకుండా నిలిపివేసింది. సరుకు ఎత్తుతున్న క్రమంలో బస్తాలను రైతు కాకుండా కూలీలే పట్టుకోవాలనే విషయంలో సమస్య ఏర్పడింది. కూలీల రేట్ల విషయంపై ఇటీవలె మార్కెట్లో పలుమార్లు చర్చలు నిర్వహిస్తున్న క్రమంలో విభజన అంశం ప్రస్తావనకు వచ్చింది.

ఈ నేపధ్యంలో కార్మికుల విభజన తప్పనిసరిగా చేయాలని అటు కార్మికులు, రైతు సంఘాల నాయకులు, వ్యాపారువర్గాలతో మార్కెట్ పాలకమండలి ఇప్పటికే రెండుసార్లు చర్చలు జరిపింది. మరోమారు ఈనెల 8న చర్చలు ఉన్నాయి. గతంలో మార్కెట్ కమిటీ రోజుల తరబడి చర్చలు జరిపి చివరకు కొన్నివర్గాల కారణంగా అసంపూర్తిగా వదిలేసిన విభజన అంశం తాజా మార్కెట్ పరిస్థితుల నేపథ్యంతో సంక్లిష్టంగా మారింది. అయితే విభజన చేసే ప్రక్రియలో సమస్యలు, ఆ తర్వాత ఏర్పడే సవాళ్లపైనే ఈ చర్చలు కొనసాగుతున్నాయి.

### అస్తవ్యస్తంగా కూలీల వ్యవస్థ..

మార్కెట్‌కు అధికంగా సరుకు వచ్చిన సమయంలో లైసెన్స్‌కూలీల స్థానంలో ప్రైవేటు (లోకల్ ముఠా) కూలీలు పనిచేస్తుండడంతోకూలీల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మార్కెటింగ్ శాఖ, కార్మిక సంఘాలు, వ్యాపారుల మధ్య సమన్వయ లోపంతో కూలీల వ్యవస్థ సక్రమంగా లేక కూలీలు శ్రమదోపిడీకి గురవుతున్నారు. మార్కెట్లో వేలం పాటల అనంతరం రైతుల సరుకులను కాంటా వేసేందుకు బస్తాల్లోకి ఎత్తడానికి ట్రేడింగ్ కంపెనీకి చెందిన లైసెన్స్ కూలీలు పనిచేయాల్సిఉంది. వివిధ సరుకుల సీజన్లో మార్కెట్‌కు వేలాది బస్తాల సరుకు విక్రయానికి వస్తుండడంతో వీటిని కాంటా వేసేందుకు ఈ కూలీలు, హమాలీలు సరిపోరు. అలాంటి సమయాల్లో సదరు లైసెన్స్ కూలీలు తమపేరుపై ప్రైవేటు కూలీలను పెట్టుకుని, పనులు చేయించి కొంత కమీషన్ తీసుకుంటున్నారు. ఇదే అలవాటుగా మారి సరుకులు తక్కువగా ఉన్న సమయంలోను లైసెన్స్ కూలీలు ఇతర పనులు చేసుకుంటూ ప్రైవేటు కూలీలచే పనులు చేయిస్తూ.. తమ కమీషన్లు తీసుకుంటున్నారు. ప్రైవేటు కూలీలు ఈ విషయంలో శ్రమదోపిడీకి గురవుతున్నారు.



కేసముద్రం మార్కెట్లో పనిచేస్తున్న కార్మికులు

### విభజన చేస్తే సమస్యలు పరిష్కారం..

మిల్లుల్లో పనిచేస్తున్న లైసెన్స్ హమాలీలు, కూలీలు అక్కడ పని చేసి మార్కెట్‌కు వచ్చే సరికి ఆలస్యమవుతోంది. దీంతో మధ్యాహ్నం 12.30 గంటలకే 'ఈ-బిడ్డింగ్'లో

మిగతా 8లో...



### కార్మికులకు న్యాయం చేయాలి

కంచ వెంకన్న, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు

మార్కెట్లో కార్మికులకు న్యాయం జరిగే విధంగా విభజన జరగాలి. గతంలో జరిగిన చర్చల్లో కార్మికులకు నష్టం అవుతుండడంతోనే విభజన విషయంలో వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలను అందే విధంగా విభజన చేయాలి. విభజన అనంతరం వచ్చే సమస్యలను అధిగమించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తే కార్మికవర్గాలు ఆమోదిస్తాయి.

7వ పేజీలో..



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సత్యశారద, తదితరులు

అంతర్జాతీయ విమానాశ్రయంగా

## మామునూరు

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో యువతకు ఉపాధి అవకాశాలు
- వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎయిర్‌పోర్టు సందర్శన



భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

## కుటుంబ సర్వే.. దేశానికే దిక్సూచి

- కుల గణనతో పెరుగనున్న బీసీ రిజర్వేషన్లు
- ఇళ్లకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంటలకు మద్దతు ధర అందేలా కృషి
- కేంద్రం పత్తి దిగుమతులు నిలిపివేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కాటారం మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం



# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వరంగల్ జిల్లా ప్రగతికి కృషి
- రైతుల సమస్యలు పరిష్కరిస్తాం
- సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

తొర్రూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అధ్యక్షత వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత బతుకమ్మలు, బోనాలు, డప్పుచప్పుళ్లతో పట్టణంలోని పాలకేంద్రం నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు పార్టీ కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్‌విప్ రాంచంద్రునాయక్‌ను కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హనుమాండ్ల తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా గుగులోత్ భట్టునాయక్, మరికొందరు డైరెక్టర్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఖరీఫ్ ధాన్యానికి రైతులకు ఎంఎస్‌పీతో పాటు రూ.500ల బోనస్ ఇస్తామని వివరించారు. స్మార్ట్ కార్డుల ద్వారా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల్లో 86వేల ఇండ్లు కట్టించి, మరో లక్ష 52 వేల ఇండ్లకు టెండర్ పిలిచి మొండి గోడలతో వదిలేశారని, నిరుపేద లబ్ధిదారులకు గృహాలు అందించలేదన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామన్నారు. వీటితో పాటు మరో 20 లక్షల ఇండ్లు నిర్మాణం చేపడతామన్నారు. పాలకుర్తిలో మాజీ మంత్రి దయాకర్ రావు మనవరాలు వయసు ఉన్న యశస్వినిరెడ్డి చేతిలో ఓడిపోయారని, నియోజకవర్గంలో అభివృద్ధి చేపట్టలేదన్నారు. భూకబ్జాలు చేశారని మంత్రి ఆరోపించారు. టీఆర్‌ఎస్ నాయకులు రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని, పాదయాత్ర చేపడితే ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ భట్టునాయక్

### నేను కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. తండ్రిలా కాళ్లు పట్టుకుంటే తడిగుడ్డతో గొంతు కోస్తారా

తనను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకున్నపుడు తండ్రి లాగ భావించి, వేలమంది కార్యకర్తల సమక్షంలో కేసీఆర్ కాళ్లు పట్టుకున్నానని, అంతే తప్ప ఏ ఆదానీ కాళ్లో ఇంకెవరి కాళ్లో నాలుగు గోడల మధ్య పట్టుకోలేదని, భవిష్యత్‌లో ఎవరికాళ్లు పట్టుకోవాలని పొంగులేటికి ఉండదన్నారు. తండ్రిలా భావించి కాళ్లు పట్టుకుంటే తన వెంట ఉన్న లక్షలాది మంది ప్రజలను

మిగతా 8లో...

దంతాలపల్లి పీఏసీఎస్ అధికారులపై

## పొంగులేటి ఆగ్రహం

- ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ సస్పెన్షన్‌కు ఆదేశం

8

# విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఉండవద్దు

సీజీఆర్‌ఎఫ్ సీఈ రమేష్

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి వినియోగించే కరెంట్ సరఫరాలో రైతాంగానికి ఆటంకాలు లేకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీజీఆర్‌ఎఫ్ (టెక్నికల్ మెంబర్) సీఈ ఎ.రమేష్ సూచించారు. కురవిలో విద్యుత్ వినియోగదారుల సదస్సును గురువారం రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయానికి విద్యుత్ అందించే ఎల్టీ లైన్స్ మొత్తాన్ని లోపాలు లేకుండా సరిచేయాలని అధికారులను ఆదేశించారు. లూజువైర్లు, రిపేరులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, ఇనుపస్తంభాలు ఉంటే వెంటనే మార్చాలన్నారు. రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, ప్రతీ ఒక్కరు ఇండ్లలో మీటర్లు బిగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం (ఫైనాన్స్) ఆర్.చరణ్‌దాస్, సీఆర్‌జీఎఫ్ (ఇండిపెండెంట్ మెంబర్) ఎం.రామారావు, ఎస్ఏవో రమాదేవి, డీఈ విజయ్‌కుమార్, ఏడీఈ ఎ.రమేష్, ఏఏవో ఎం.రమేష్, ఏఈ శారద పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రమేష్



# బయ్యారంలో వైన్‌షాపు ఎదుట ఆందోళన

మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని డిమాండ్

బయ్యారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబసభ్యులు గురువారం బయ్యారంలో వైన్‌షాపు ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.

సంతులాల్‌పోడు తండాకు చెందిన బానోత్ ప్రేమ్‌కుమార్ స్థానిక కనకదుర్గ వైన్‌షాపులో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే సుమారు రెండేళ్ల క్రితం వైన్‌షాపు నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొట్టి ప్రేమ్‌కుమార్ మృతి చెందాడు. దీంతో వైన్‌షాపు నిర్వాహకులు రూ.1.50 లక్షలు చెల్లిస్తామని ఒప్పందం చేసుకొని రూ.50 వేలు చెల్లించినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మిగిలిన ఒక లక్ష రూపాయాలు కోసం ఎంత అడిగినా వైన్‌షాపు నిర్వాహకులు స్పందించలేదన్నారు. దీంతో భార్య రాజేశ్వరితో కలిసి బాధిత కుటుంబసభ్యులు, తండావాసులు పరిహారం కోసం గురువారం బయ్యారంలోని కనకదుర్గ వైన్‌షాపు ఎదుట బైటాయించి, ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి ఘటన స్థలికి చేరుకొని ఆందోళనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సమస్య పరిష్కారానికి వైన్‌షాపు నిర్వాహకులు, బాధిత కుటుంబసభ్యులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.



బయ్యారంలో వైన్‌షాపు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

# విప్లవాలను అణచివేయడం ఎవరివల్ల కాదు

- ఆకలి కేకలు ఉన్నంత కాలం విప్లవం ఉంటుంది
- ఎన్డీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరరావు
- కొత్తగూడలో ఘనంగా అమర వీరుల సంస్మరణ సభ

కొత్తగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో విప్లవోద్యమాలు అణచివేస్తానని, విప్లవకారులను లేకుండా చేస్తానని కేంద్రంలో ఉండేవారు కలలు కంటున్నారని, వాటిని అణచివేయడం అసాధ్యమని ఎన్డీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వేంకటేశ్వరరరావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, ఆకలికేకలు ఉన్నంత కాలం విప్లవోద్యమాలు ఉంటాయని తెలిపారు. కొత్తగూడలో పొలడుగు కృష్ణ సంస్మరణ సభను ఎన్డీ నాయకులు గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో డప్పువాయిద్యాలు మ్రోగిస్తూ, నినాదాలు చేస్తు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నే వాడికి భూములు కావాలని నాటి అమరుల పోరాట త్యాగ ఫలితంగానే నేడు ప్రజలు భూములు సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు సాగుచేసుకుంటున్న భూములకు అటవీహక్కు చట్టం ప్రకారం హక్కుపత్రాలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సభలో ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య, రాష్ట్ర నాయకులు బండారి అయిలయ్య, వరంగల్ జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకుడు భూర్కవెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వజ్జ సమ్మక్క, నాయకులు శ్రీశైలం, బుచ్చిరాములు, యుగేందర్, గజ్జి సోమన్న, రాజమల్లు పాల్గొన్నారు.



కొత్తగూడలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు



ఏటీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న టీజీఐఐసీ ఎండీ, కలెక్టర్, సబ్ కలెక్టర్

## అత్యాధునిక శిక్షణనందించేందుకే ఏటీసీలు

### టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐటీఐల విద్యార్థులకు అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో అత్యాధునిక శిక్షణ నందించడానికే రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల నిర్మాణం చేపట్టిందని టీజీఐఐసీ(రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ)ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కాటారం మండలకేంద్రంలోని సర్వే నెంబర్ 49లోని ఐటీఐ అప్‌గ్రేడ్‌లో భాగంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం చేయడానికి ఎకరం స్థలాన్ని అధికారులు కేటాయించారు. ఈ స్థలాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో నిర్మాణ ప్రణాళికలు, మౌలిక సదుపాయాల అమలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏటీసీ నిర్మాణం నాణ్యతతో పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తహసీల్దార్ నాగరాజు, ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి, ఆర్ఐ వెంకన్న పాల్గొన్నారు.

## మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న రవికుమార్, తదితరులు

వాజేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మోడికుంట ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని గుమ్మడిదొడ్డిలో ఆ పార్టీ 9వ మండల మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మోడికుంట వాగుపై నిర్మించే ప్రాజెక్టు పెండింగ్‌లో ఉందని, ప్రాజెక్టు విశిష్టతను ఆనాడే సీపీఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య తెలిపారన్నారు. గత 25 సంవత్సరాలుగా మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో మోడికుంట నిర్మాణంపై దశలవారీ ఉద్యమానికి రూపకల్పన చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతకు ముందు పార్టీ జెండాను సీనియర్ నాయకురాలు తుమ్మ దేవేంద్ర ఆవిష్కరించారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ దావూద్, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు దామోదర్, కృష్ణబాబు, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

## పులిపిరికి అరుదైన చికిత్స

### ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, నవంబర్ 7: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కల గుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.



# పేదల బియ్యం పక్కదారి!

- నర్సింహులపేట మండలంలో యథేచ్ఛగా దందా
- రేషన్ దుకాణాల నుంచి బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న వైనం
- నెలకు వెయ్యి క్వింటాళ్ల వరకు వ్యాపారుల పాలు
- చక్రం తిప్పుతున్న ఓ అధికారి?
- డీలర్లు, అధికారులకు కాసుల వర్షం



నర్సింహులపేట మండలం నుంచి అర్ధరాతి వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

నర్సింహులపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం పౌరసరఫాల శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న పీడీఎస్ రైస్ రేషన్‌డీలర్లు, అధికారులు, వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కిలో రూ.6కు కొనుగోలు చేసి, దళారులకు రూ.10 నుంచి రూ.12కు విక్రయించి, జేబులు నింపుకొంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలంలోని రేషన్ డీలర్లు మూడు బృందాలుగా ఏర్పడి, సీనియర్ డీలర్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ సివిల్ సప్లయీస్ అధికారులకు కమీషన్లు మాట్లాడి, గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ బియ్యం దందాలో ఓ ద్వితీయ స్థాయి పోలీస్ అధికారి తెరవెనకాల చక్రం తిప్పుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. నర్సింహులపేట మండలంలో 22 రేషన్ దుకాణాలకు గాను 9,100 కార్డులకు 1,600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇందులో 1,000 కింటాళ్ల రైస్ వరకు చీకటి దందాకు తరలుతున్నట్లు సమాచారం. ప్రధానంగా నర్సింహులపేట, పెద్దనాగారం, ముంగిమడుగు కేంద్రాలుగా ఏర్పడి బియ్యాన్ని రాత్రి వేళల్లో ఆటోలు, ఇతర రవాణా వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం.

**లోపించిన పర్యవేక్షణ..**

రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపంతో రేషన్ డీలర్ల బియ్యం దందాకు అడ్డులేకుండా పోతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. నెలసరి పంపిణీ అయ్యే బియ్యం కోటాలో ఎంతమేరకు కార్డుదారులకు ఇస్తున్నారు, ఎంత అక్రమంగా అమ్ముతున్నారో తెలియని దుస్థితి నెలకొన్నది. గతంలో రేషన్ షాపులను ప్రతీ మూడు మాసాలకు ఒకసారి రెవెన్యూ అధికారులు సందర్శించి పంపిణీ.. స్టాక్ నిల్వలను పరిశీలించేవారు. అయినా నెలసరి వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటే, ఏ అధికారి పటించుకొకపోవడంలో ఆంతర్య మేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం



పేద ప్రజలకు పంపిణీ చేయాల్సి రేషన్ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. రేషన్ డీలర్లు బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా, రిటన్‌గా కేజీకి రూ.6 చొప్పున ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విజిలెన్స్ నిఘాను పెంచి బాధ్యులపై 6ఏ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

- గణేష్, ఆర్డీవో తొర్రూరు

**చక్రం తిప్పుతున్న ఓ అధికారి..**

మండల రేషన్ డీలర్లకు, సూర్యాపేట జిల్లాకు చెందిన బియ్యం వ్యాపారితో చీకటి ఒప్పందం కుదుర్చుకొన్న ఓ పోలీస్ అధికారి చక్రం తిప్పుతూ దందాలో పరోక్షంగా పాల్గొంటూ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ చీకటి దందా ఒప్పందాలపై ఇటీవల నిఘా అధికారులు ఆరా తీసి క్షేత్రస్థాయి నివేదికను జిల్లా పోలీసు బాస్‌కు అందజేసినట్లు సమాచారం.

**కాసుల వర్షం..**

రేషన్ బియ్యం దందాలో పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులతో పాటు రేషన్ డీలర్లకు కాసుల వర్షం కురుస్తున్నట్లు ప్రజలు నుంచి ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని బాధితుల నుంచి కేజీ రూ.6 కొనుగోలు చేసి చీకటి దందా వ్యాపారులకు రూ. 10 నుంచి రూ.12 వరకు అమ్ముతున్నారు. ఈ లెక్కన నెలనెల రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం.

## నెల రోజులైనా గింజ కూడా కొనుగోలు చేయలే

**కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో రైతులను ఆగం చేస్తోంది**

**నమ్మకం లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

వర్ధన్నపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుల కేంద్రాలు ప్రారంభించి నెల రోజులైనా ప్రభుత్వం ఒక్క గింజ కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదని, ప్రభుత్వం నమ్మకం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. గురువారం వర్ధన్నపేట మండలం రాంధాన్‌తండా నుంచి వెళ్తూ ఇల్లంద గ్రామ సమీపంలోని ఓ పొలం వద్ద ఆగిన ఆయన అక్కడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎదుట పలువురు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. పంటకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వకపోగా కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పథకాల అమలు మాట దేవుడెరుగు గానీ, పాత పథకాలైన రైతుబంధు నిలిపివేసి రుణమాఫీ ఎగ్గొటిందని, ఈ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేకపోవడంతో తాము ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలవుతున్నా ఒక్క గింజను కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తే ఈ ప్రభుత్వం తడిచిన ధాన్యమని, తేమ శాతం ఎక్కువ ఉందని కొర్రీలు పెడుతూ రైతులను ఆగం చేస్తోందన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలుచేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రతీ గింజను కొనుగోలు చేయాలని, మద్దతు ధరతోపాటు బోనస్‌ను కూడా ఇవ్వాలని, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు అనిమిరెడ్డి రాజమల్లయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నముప్పారంలో

## వీధికుక్కల స్వైరవిహారం

### ఒక్క రోజే ముగ్గురిపై దాడి

ఇనుగుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలం చిన్నముప్పారంలో గురువారం వీధికుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామంలో విద్యుత్ బిల్లులు జారీ చేసే సిబ్బంది ఎడ్లోజు రాజశేఖర్‌తోపాటు ఇదే గ్రామానికి చెందిన ముంజంపల్లి పూలమ్మ, కాలేరు హరీష్‌లను వీధి కుక్కలు వేర్వేరు ప్రాంతాల్లో కరిచాయి. గాయపడిన వారు ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. అయితే కుక్క కాటు వైద్యానికి సంబంధించిన మొదటి డోసు ఇంజక్షన్ మాత్రం ఇనుగుర్తి పీహెచ్‌సీలో ఇవ్వగా మిగతా డోసులు మాత్రం నెల్లికుదురు పీహెచ్‌సీలో తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించినట్లు బాధితులు తెలిపారు. చిన్నముప్పారం గ్రామం నెల్లికుదురు పీహెచ్‌సీ పరిధిలో ఉన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఒకే రోజు ముగ్గురిని కుక్కలు కరవడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో కుక్కలను వెంటనే నివారించి ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## అనుమతి ఉన్న మందులనే విక్రయించాలి

**ఏఈడీ అజ్మీర శ్రీనివాసరావు**



మహబూబాబాద్‌లోని ఎరువుల దుకాణాన్ని తనిఖీల చేస్తున్న శ్రీనివాసరావు

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ప్రభుత్వ అనుమతి ఉన్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని మహబూబాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాసరావు సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని రైతు మిత్ర అగ్రిమాల్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను, పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డితో సంయుక్తంగా గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని చెప్పారు. ఎరువుల లైసెన్స్‌ల్లో వివిధ కంపెనీలకు సంబంధించిన జీరో ఫారంలో చేర్చాలని చెప్పారు. ఎరువులు వచ్చిన వెంటనే ఈపాస్ మిషన్‌లో నమోదు చేసి రైతు ఆధార్‌కార్డు ద్వారానే విక్రయించాలని తెలిపారు.

**వడ్ల కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి**

గూడూరు: ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. గూడూరు శివారు వడ్డెర గూడెంలోని రైతు వేదికలో పీపీసీ సెంటర్ ఇన్‌చార్జులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లకు, రైతులకు గురువారం ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు ఆరబెట్టి శుభ్రంచేసి తీసుకురావాన్నారు. 17 లోపు తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్, ఇన్‌చార్జి తహసీల్దార్ కోమల, ఐకేపీ ఏపీఎం రవీందర్, ఏఈవోలు, సొసైటీ కార్యదర్శి, గిరిజన కోఆపరేటివ్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## కొమ్మకుళ్లు తెగులును ఆదిలోనే అరికట్టాలి



మల్యాలలో మిర్చి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిర్చి, టమాట తోటలకు కోనోపొర కొమ్మకుళ్లు తెగులు వ్యాప్తి చెందుతుందని వాటిని ఆదిలోనే అరికట్టాలని మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి నాగరాజు తెలిపారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాలలో మిర్చి, టమాట తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి తోటల్లో కొమ్మకుళ్లు తెగులు, లద్దె పురుగు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. తొలి దశలోనే వాటికి సరైన మందులు వాడుతూ క్షేత్ర పరిశుభ్రత పాటిస్తే తెగుళ్ల ద్వార వచ్చే నష్టాన్ని అరికట్టగలమని తెలిపారు. ఈ కొమ్మకుళ్ల తెగులు నివారణ ప్రొపి కొనోజోల్ లీటర్ నీటికి అర ఎంఎల్ లేదా, ఎక్స్ కొనోజోల్ ఒక లీటర్‌కు అర మిల్లిలీటర్ కలిపి పిచికారి చేయాలని తెలిపారు. టమాట కాయ తొలిచే పురుగు నివారణకు హిమామెక్టిన్ బెంజోయెట్ 10 లీటర్ల నీటికి నాలుగు మిల్లీలీటర్ల మందు కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే తోటలో లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## మానుకోట ఇంచార్జ్ డీడబ్ల్యూవోగా శిరీష



శిరీషకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ఇంచార్జ్ సంక్షేమ అధికారిగా స్థానిక సీడీపీవో శిరీష గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీడబ్ల్యూవోగా పనిచేసిన వరలక్ష్మి అక్టోబర్ 30న పదవీవిరమణ పొందారు. ఆమె స్థానంలో సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న శిరీషకు అదనంగా డీడబ్ల్యూవోగా బాధ్యతలు అప్పగించారు. నూతనంగా ఇంచార్జ్ డీడబ్ల్యూవోగా బాధ్యతలు స్వీకరించిన శిరీషను బీఆర్‌టీయూ అంగన్‌వాడీ హెల్పర్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షురాలు గుండు సులోచన, కార్యదర్శి హేమ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుజాత, సునిత, సరస్వతి, జయమ్మ పాల్గొన్నారు.

# రామప్ప కాలువలతో పరేషాన్..!

- చెరువులు,కుంటల నుంచి వృథాగా పోతున్న సాగునీరు
- నీటి నిలువలకు యాసంగిలో ఇక్కట్లు
- మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్



రామప్ప ప్రధాన కాలువల్లో మొలిచిన పిచ్చిమొక్కలు

వెంకటాపూర్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి): వానలతో నిండుకున్న నీటి వనరులను కాపాడుకోవడం యాసంగి సాగులో ముఖ్యం. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలతోపాటు కాకతీయులు నిర్మించిన రామప్ప సరస్సు సైతం నిండుకోవడంతో రైతులు కొంత సంబరపడ్డారు. కానీ, రామప్ప సరస్సు కింద ఉన్న కాలువలైన కొత్తకాలువ, వీర్ల కాలువ, ఒగరుకాలువ, బూర్గుకాలువ, సోమికాలువలతోపాటు తదితర చెరువుల కాలువలు పాడవ్వడంతో నీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యాసంగిలో వరిపంట సాగు చేసుకునేందుకు కుంటలు, చెరువుల్లో ఉన్న నీరే ఆధారం. వర్షాకాలంలో సరైన సమయంలో వానలు కురువకపోవడంతో చాలా మంది రైతులు వరిసాగుకు వెనకడుగు వేశారు. సీజన్ చివర్లో సమృద్ధిగా వర్షాలు కురువడంతో చెరువులు, కుంటలతోపాటు రామప్ప చెరువు కూడా నిండుకుండల్లా మారాయి. వాటిలో కొన్ని చెరువులు, కుంటలు అలుగు కూడా పడ్డాయి. చెరువులు, కుంటలు నిండకుండల్లా ఉన్న నీటిని చూసి రైతులు యాసంగి సాగుపై ఆశ పెంచుకున్నారు. ప్రస్తుతం కుంటలు, చెరువుల్లో నీరు వృథా కాకుండా నిలువ ఉంటేనే వేసవిలో ఉపయోగపడుతాయి.

**కోత సమయంలో తిప్పలు**

మండల పరిధిలోని గ్రామాల్లో గల చెరువులు, కుంటలు ఇటీవల కురిసిన వర్షాలకు నిండినా ప్రస్తుతం కాలువలు సరిగా లేకపోవడంతో నీరు వృథా అవుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. రామప్ప చెరువు కింద సాగు చేసిన వర్షకాలం పంటలు కోతకు వచ్చాయి. చెరువు నుంచి వస్తున్న నీరు కాలువలు సరిగా లేకపోవడంతో పంట కోయడానికి సిద్ధంగా ఉన్న భూములు బురదమయంగా మారుతున్నట్లు రైతులు వాపోతున్నారు. రామప్ప చెరువు కింద సుమారు 10 వేల ఎకరాల మేర ఆయకట్టు ఉంటుందని రైతులు తెలిపారు. రామప్ప చెరువులో నీరు నిండుగా ఉంటే యాసంగి వరి సాగుకు ఉపయుక్తంగా ఉంటుంది. రైతుల కష్టాలను అధికార యంత్రాంగం దృష్టిలో ఉంచుకుని కాలువలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# నకిలీ వైద్యులతో జాగ్రత్తగా ఉండాలి

**వరంగల్ జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా**



వివరాలు తెలుసుకుంటున్న కమిటీ బృందం

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు, పీఎంపీలు వైద్యులు కాదని, ప్రజలు తెలిసీతెలియక వారి వద్దకెళ్లి చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వరంగల్ జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా సూచించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనుకుంట తండాకు చెందిన బానోతు ఐశ్వర్య (16)కు హరిపిరాల కు చెందిన నకిలీ వైద్యుడు చెన్నా సారయ్య వైద్యం చేయడంతో గత నెల 25న మృతిచెందారు. ఈ ఘటనపై సుమోటా తీసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ లీగల్, యాంటీ క్వాకరీ కమిటీ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ శిరీష్, సభ్యులు డాక్టర్ తిరేష్‌లతో కూడిన బృందం గురువారం విచారణ చేపట్టింది.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలలో చట్టవిరుద్ధంగా ఎలాంటి అర్హత లేకుండా నకిలీ వైద్యుడు చెన్న సారయ్య నిర్వహిస్తున్న సెంటరును తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సారయ్యకు వైద్య పరంగా ఎలాంటి విద్యార్హత లేదని, కనీసం పదో తరగతి కూడా పాస్ కాకుండానే ఆర్ఎంపీగా అవతారం ఎత్తినట్లు పేర్కొన్నారు. సారయ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఫార్మసిస్టు లేకుండా సాయిరామ్ మెడికల్ షాపు నిర్వహిస్తూ మందులు కూడా విక్రయిస్తున్నట్లు తెలిపారు. సారయ్యకు ఫార్మసీ సర్టిఫికెట్ ఇచ్చిన గజవెల్లి స్వాతిపై చర్యలు తీసుకోవాలని ఫార్మసీ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. అనంతరం తండాలోని మృతురాలి ఇంటికి వెళ్లిన బృందం కుటుంబసభ్యులను బృందం పరామర్శించింది. నకిలీ వైద్యులు సారయ్య ఇచ్చిన ఇంజక్షన్ వల్లనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు విచారణ బృందంతో చెప్పి కన్నీటి పర్యంతం అయినట్లు తెలిపారు.

### వరంగల్ మార్కెట్ ధరలు

| పంట | క్వింటా గరిష్ట | క్వింటా కనిష్ట |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2334 | 2080 |
| పల్లికాయ (సూక) | 5000 | 4000 |
| పల్లికాయ (పచ్చిది ) | --- | --- |
| కందులు | 7712 | 6550 |
| పెసళ్లు | 6912 | 4052 |
| పత్తి | 6910 | 5500 |
| కొత్తపత్తి | --- | --- |
| పసుపు (కాడి) | 10069 | 10450 |
| పసుపు (గోల) | 10027 | 90250 |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ ఏసీ | 16200 | 12000 |
| వండర్‌హాట్ ఏసీ | 14000 | 11000 |
| యూఎస్341ఏసీ | 15000 | 11000 |
| దేశీ ఏసీ | --- | --- |
| సింగిల్‌పట్టి ఏసీ | --- | --- |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం


చింతల శివకృష్ణ


నూకల అనిల్


తిక్క వినోద్


బండి ప్రశాంత్


నల్లపు అనిల్ (ఆర్మీ)


యూ వెంకటేశ్వర్లు, (ఆర్మీ)


యాసం ప్రశాంత్ (సీఐఎస్ఎఫ్)


కన్నెబోయిన కుమార్ (ఆర్మీ)

# దేశ సేవలో.. రైతు బిడ్డలు

- పుట్టింది పూరి గుడిసెల్లో.. చేరింది సైన్యంలో..
- ఒకే ఊరి నుంచి ఏడుగురు సైనికులు
- మాతృభూమిపై మమకారంతో ముందుకొస్తున్న యువకులు
- పుట్టిన గ్రామం, అయిన వారిని వదిలి దేశం కోసం సేవ
- త్రివిధ దళాల్లో సీతారాంపురం, అప్పలరావుపేట యువత


ఇష్టబోయిన నరేశ్ యాదవ్


ఇష్టబోయిన రమేశ్ యాదవ్


బండి తిరుపతి

పరకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నింగి అంచున రెపరెపలాడుతున్న ఓ త్రివర్ణ పతాకమా నీ సంతోషానికి కారణం ఏమిటని ప్రశ్నిస్తే ఇదిగో నా సైనికుల గుండెలపై మోస్తున్న జెండా అంటూ బదులిచ్చింది. పుట్టింది పూరి గుడిసెల్లో అయినా మాతృభూమిపై మమకారంతో పుట్టిన ఊరు, అయిన వారిని వదిలి ఏళ్ల తరబడి దేశ రక్షణకు అంకితమయ్యారు. ఆ యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. హనుమకొండ జిల్లా పరకాల మునిసిపల్ విలీన గ్రామం సీతారాంపురానికి చెందిన ఇష్టబోయిన రమేశ్, తిక్క వినోద్, బండి తిరుపతి, ఇష్టబోయిన నరేశ్, నూకల అనిల్, చింతల శివకృష్ణ, బండి ప్రశాంత్ (సీఆర్‌పీఎఫ్)కు ఒకే ఊరి నుంచి ఏడుగురు జవాన్లుగా ఎంపికయ్యారు. ఇందులో కొందరు తండ్రిని కోల్పోయి తల్లుల ఆసరాతోనే దేశ సేవ కోసం ముందడుగు వేశారు. అందరూ రైతు బిడ్డలే. వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగించేవారే.

ఇందులో చింతల శివకృష్ణ కుటుంబం పేదరికంలో ఉండేది. ఒకసారి గాలివానకు ఊరు చివర వేసుకున్న పాక కొట్టుకపోయింది. కొన్ని రోజులు ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో తల దాచుకున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఓ వైపు అప్పులు మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో కాలం వెళ్లదీసే కుటుంబాలే. బండి రవి- సులోచన దంపతుల కుమారులు తిరుపతి, ప్రశాంత్. రవి తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తూ అలాగే వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. అనుకోకుండా రవి మృతితో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భర్త చనిపోయినా సులోచన ధైర్యం కోల్పోకుండా పట్టుదలతో ఇద్దరి కుమారులను దేశ సేవ కోసం సైన్యంలోకి పంపించింది. అదేవిధంగా నూకల కొమురయ్య కుమారుడు అనిల్ చాలా కష్టపడి సీఆర్పీఎఫ్‌లో ఉద్యోగం సంపాదించాడు. తన తండ్రి తమ గొర్లను కాస్తూ వ్యవసాయం చేసేవాడు. తను కూడా అకాల మరణంతో అనిల్ కృంగిపోకుండా దేశ సేవ చేయాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. నిరుపేద కుటుంబాల పిల్లలే నేడు సైనికుల్లా మారారు.

**దేశ రక్షణకు అంకితం..**

దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరిన యువకులకు నేటికి ఇబ్బందులు తప్పడం లేదు. సరిహద్దుల్లో ప్రాణాలను లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఏళ్ల తరబడి కన్నవారిని, పుట్టిన గ్రామాన్ని వదిలి సేవ చేస్తున్నారు. ఇందులో ఒక్కరిద్దరికి పెళ్లయినా భార్య పిల్లలను వదిలి దేశ రక్షణ కోసం వెళ్లారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి దేశ సేవ చేస్తున్న యువకులది మా ఊరు అంటూ చెప్పుకొని ఆ గ్రామం నేడు గర్విస్తోంది. అంతే కాకుండా గ్రామానికి చెందిన ఇష్టబోయిన సురేశ్ ఎస్‌ఐగా ఉద్యోగం నిర్వహిస్తున్నాడు.

అడప రాజు కానిస్టేబుల్‌గా.. ఇలా గ్రామం నుంచి పోలీసు సేవలు అందించడం సీతారాంపురం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోంది.

**తల్లిగా గర్వపడుతున్నా..**



బండి సులోచన, సీతారాంపురం

భర్త చనిపోయినా ధైర్యం కోల్పోలేదు. పిల్లలను దేశ రక్షణలో చేర్పించాలని ఒక సంకల్పంతో ముందుకు సాగా. అడ్డంకులు, ఇబ్బందులు వచ్చినా ఇద్దరు కుమారులు పట్టుదలతో సైనికులై దేశ సేవ చేస్తున్నారు. నాకు చాలా గర్వంగా ఉంది.

**మా ఊరు నుంచే ఎక్కువ మంది సైనికులు**



నల్లెల్ల జ్యోతి, కౌన్సిలర్

మా ఊరు సీతారాంపురం నుంచే దేశ రక్షణ కోసం ఏడుగురు జవాన్లు ఎంపికయ్యారు. దేశ సేవ చేయడం చాలా సంతోషంగా ఉంది. అందులో మా బంధువులు కూడా ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మరి కొంత మంది యువకులు సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు.

**ఆదర్శం**

నెక్కొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేడు విద్యావంతులు ఆర్థికంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని జన్మభూమిని వదిలి 70 శాతం మంది విదేశాలకు వెళ్తున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామ యువకులు దేశ సేవ కోసం ఆర్మీలో చేరి ఆదర్శంగా నిలుస్తున్నారు. పిల్లలు ఆర్మీలో చేరడానికి తల్లిదండ్రులు అడ్డు చెప్పకపోగా జన్మభూమికి సేవచేసే భాగ్యం అందరికి దొరకదంటూ ప్రోత్సహిస్తు న్నారు. గతంలో గ్రామంలో యువత వ్యవసాయం తో పాటు కులవృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకునేవారు. ప్రభుత్వం ఉద్యోగం అంటే ఏమిటో తెలియని ఆ గ్రామం నుంచి ఏకంగా దేశరక్షణ కోసం వీధికొక్కరు ఎంపికయ్యారు. ఈ ఒక్క గ్రా మం నుంచే ఇరవై మందికి పైగా త్రివిధ దళాలైన ఇండియన్ ఆర్మీ, నావికదళం, ఎయిర్‌ఫోర్స్‌లో విధు లు నిర్వర్తిస్తున్నారు. మండల ప్రజల నుంచి అభినందనలు అందుకుంటున్నారు.

**ఆర్మీలో చేరుతున్న యువత**

నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏటా గ్రామానికి చెందిన యువకులు సైన్యంలో చేరుతున్నారు. ఇప్పటి వరకు ఇరవై మందికి పైగా రక్షణ విభాగంలోని అనేక శాఖల్లో విధులను నిర్వర్తిస్తున్నారు. యువత సైన్యంలో చేరుతుండడంతో అప్పల్‌రావుపేట గ్రామానికి జిల్లాలో మంచి గుర్తింపు వస్తుంది.


అప్పల్‌రావుపేట

సైన్యంలోనే కాకుండా పోలీసు శాఖలో సైతం పలువురు విధులు నిర్వహిస్తున్నారు. యువత సైన్యంలో చేరాలంటూ ఆర్మీలో విధులను నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రోత్సహిస్తున్నారు.

**ఆర్మీ వీరులు వీరే..**

ఆర్మీల్లో 18 సంవత్సరాల నుంచి ఊడుగుల సంతోష్, మడత రాజ్‌కుమార్, ఊడుగుల వెంకటేశ్వర్లు, ముత్తినేని శివ, నల్లపు అనిల్, కన్నెబోయిన కుమార్, మురారిశెట్టి రాజులు విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐఎస్ఎఫ్‌లో బోళ్ల అనిల్, యాసం ప్రశాంత్, మహ్మద్ రహీంపాషా, బోళ్ల అరుణ్, కొయ్యడి అఖిల్, నావిక దళంలో బేర మణికృష్ణ, ఎయిర్‌ఫోర్స్‌లో అక్కల అనిల్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు.


బోళ్ల అరుణ్ (సీఐఎస్ఎఫ్)

**ఒకే కుటుంబంలో పోలీసులుగా..**

ఈ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన తిప్పని చంద్రశేఖర్, తిప్పని శ్రావణ్, తిప్పని రంజిత్ కుమార్, తిప్పని అరుణ్‌కుమార్ విధులు నిర్వర్తించడం విశేషం. అలాగే మడత సృజన, మాలి సురేష్ కూడా పోలీసు శాఖలో పని చేస్తున్నారు.


మడత సృజన (పీసీ)

**మొదట సైన్యంలో చేరిన మైబూబ్‌పాషా, శ్రీధర్**


మైబుబ్‌పాషా (బీఎస్ఎఫ్)

సైనిక ఉద్యోగం అంటే భయపడుతున్న రోజుల్లో ఇదే గ్రామానికి చెందిన మైబూబ్‌పాషా బీఎస్ఎఫ్, ఊడుగుల శ్రీధర్ 2001 సంవత్సరంలో ఆర్మీల్లో చేరారు. ఇద్దరు యువకులు ధైర్యంగా ముందడుగు వేయడంతో యువతకు దేశరక్షణలో సేవలందించాలనే ఆసక్తి కల్గింది. అప్పటివరకూ ఆర్మీలో చేరాలంటే ఉన్న భయాన్ని యువత, వారి తల్లిదండ్రుల్లో పారదోలి ఆదర్శంగా నిలిచారు.


ఊడుగుల శ్రీధర్ (ఆర్మీ)

# అంతర్జాతీయ విమానాశ్రయంగా మామునూరు

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉపాధి అవకాశాలు
- వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంపీ, ఎమ్మెల్యేలతో ఎయిర్‌పోర్టు సందర్శన

శంభునిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధిలో ఎంతో కీలకమైన మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామని, ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదలతో కలిసి ఆమె గురువారం మామునూరు విమానాశ్రయాన్ని పరిశీలించారు. భూసేకరణ గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం ఎయిర్‌పోర్టుతో భూములు కోల్పోతున్న నక్కలపల్లి, గాడెపల్లి, గుంటూరుపల్లి గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. మామునూరు విమానాశ్రయం కోసం 253 ఎకరాల భూమి అవసరం ఉండగా, ఆ భూముల యజమానులు 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు.

చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్‌లో పర్యాటకపరంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాలతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్కు, భవిష్యత్ పరిశ్రమలకు అనుగుణంగా మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు పలు పరిశ్రమలు ఉండటం వలన ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్లలోపు ఉన్న వరంగల్‌లో ఎయిర్‌పోర్టు కుదరదని చెప్పినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థను ఒప్పించారన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరఫున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులను, స్థానిక ప్రజలకు మంత్రి సురేఖ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపి అభినందించారు. రైతులకు, ప్లాట్ల యజమానులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. అందుకు కావాల్సిన నిధులు, రైతులకు కేటాయించే స్థలాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కావాల్సిన మ్యాపింగ్, పరిహారం చెల్లింపు సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్ సత్యశారదను మంత్రి సురేఖ ఆదేశించారు.


అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా రవాణా వ్యవస్థ మెరుగుపడాలన్నారు. అందుకు అణుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనితోపాటు నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేలైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులకు భూములు త్యాగం చేసిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సిన నిధులను సీఎం ద్వారా మంత్రి కొండా సురేఖతో కలిసి మంజూరు చేయిస్తామని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నగర ప్రజల కల అయిన ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో నగర రూపురేఖలు మారుతాయన్నారు. నగర అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఓరుగల్లు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు, ఇన్నర్ రింగ్‌రోడ్, ఓఆర్ఆర్, అండర్ డ్రైనేజీ నిర్మాణాలతో వరంగల్ ప్రపంచ శ్రేణి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులను సంతృప్తి పరిచి వారి అంగీకారం మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకరిస్తున్న రైతులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని, ప్రస్తుతం ఉన్న భూమిని పూర్తి స్థాయిలో సర్వే చేయించి మ్యాపింగ్ చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలు, రైతులు కోరుతున్న ధరలు, కావాల్సిన నిధులతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, ఈదురు అరుణ, బైరబోయిన ఉమదామోదర్ యాదవ్, చింతాకుల అనిల్, సురేష్ జోషి, భోగి సువర్ణ -సురేష్, ముష్కమల్ల అరుణ, ఓని స్వర్ణలత, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ఫుర్ఖాన్, టీపీసీసీ సెక్రెటరీ మీసాల ప్రకాశ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేందర్‌రావు, ఈఈ జితేందర్ రెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రుణమాఫీలో సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్ధన్నపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏఎంసీ ప్రమాణ స్వీకారానికి హాజరు

వర్ధన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలో అమృత్ పథకాలకు సంబంధించిన శిలాఫలకాలకు, మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పథకాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో కలిసి శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామాల్లో నడిబొడ్డున గ్రామ సభ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తిస్తామని పేర్కొన్నారు. రుణమాఫీకాని రైతులకు సాంకేతిక లోపాలు తొలగించి డిసెంబర్ చివరి నాటికి వారి ఖాతాలో డబ్బులు జమ చేయనున్నామన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతులను ఆదుకుంటామని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, సభకు హాజరైన ప్రజలు

దేశ చరిత్రలోనే రూ.31వేల కోట్లు రైతుల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని అన్నారు. కారు కూతలు కూసిన ప్రతిపక్ష నేతలు టైరు కింద తలకాయ పెడతారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలన్నీ గులాబీ రంగు చొక్కా వేసుకున్న వారికే చెందాయని విమర్శించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున పక్కా గృహాలను మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ ఐదేళ్లలో అర్హులైన వారందరికీ అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరయ్యే విధంగా, అన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగపడేలా ఒక్కో కుటుంబానికి ఒక స్మార్ట్ కార్డును అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు చెప్పిన, చెప్పని అంశాలు, అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

అనంతరం వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నరుకుడు వెంకటయ్య, డైరెక్టర్లతో సభా వేదికపై ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలోని విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గానికి అదనంగా మరో 1,500 గృహాలను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ సుధీర్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, పిన్నింటి అనిల్‌రావు, ఎద్దు సత్యనారాయణ, మైస సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంటలకు మద్దతు ధర అందేలా కృషి
- కేంద్రం పత్తి దిగుమతులు నిలిపివేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు
- సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధర అందేలా సర్కారు కృషి చేస్తోందని తెలిపారు. మండలంలో ఆయన గురువారం పర్యటించారు. కాటారంలోని మీనాక్షి, చల్లపల్లిలోని రుద్ర జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. రైతులు ట్రాక్టర్లలో తెచ్చిన పత్తిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడులు, దిగుబడులు, ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. మీనాక్షి జిన్నింగ్ మిల్లులో పత్తి జిన్నింగ్ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ దేశంలో పత్తి దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయన్నారు. నాణ్యమైన పత్తి లక్షలాది టన్నుల నిల్వలున్నా కేంద్రం విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. కేంద్రం పత్తి దిగుమతులు నిలిపేసి రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. సీసీఐ ద్వారా పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 చెల్లిస్తున్నా తేమ శాతం పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తేమ శాతంపై సీసీఐ కఠినంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సీసీఐ కేంద్రాల నిర్వాహకులు పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. వడ్ల కొనుగోళ్ల కోసం పీపీసీల ప్రారంభం జరుగుతుందన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటుందన్నారు.



కాటారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మిల్లర్లు తేమ, తాలు పేరిట కటింగ్ చేస్తే సహించేది లేదన్నారు. రైతులు వడ్లను శుభ్రపరిచి ఆరబెట్టి కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర అందుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)అశోక్ కుమార్, డీసీఎస్‌వో శ్రీనాథ్, సివిల్ సప్లయ్ డీఎం రాములు, డీసీవో వాల్యానాయక్, డీఎంవో కనకశేఖర్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, సీపీవో ఇలంగోన్, మిల్లర్లు సాగర్‌రెడ్డి, శివకుమార్, సాంబిరెడ్డి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వే.. దేశానికే దిక్సూచి

- కుల గణనతో పెరుగనున్న బీసీ రిజర్వేషన్లు
- అధికారులకు ప్రజలు సహకరించాలి
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన ఇంటింటి కుటుంబ సర్వే తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సామల లింగమూర్తి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించి ఓదార్చారు. అనంతరం గట్లనర్సింగాపూర్ గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


గట్లనర్సింగాపూర్‌లో కూరగాయలు అమ్మే మహిళతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అలాగే గట్లనర్సింగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కులగణన సర్వేను పరిశీలించారు. కుల గణనపై అధికారులకు సమగ్ర వివరాలు ఇవ్వాలని, సమాచారం గోప్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, కూరగాయలు అమ్ముతున్న మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో 1.17 కోట్ల ఇళ్లపై సర్వే జరుగుతుందన్నారు. ఇందుకోసం 87వేల మంది ఎన్యుమరేటర్లను నియమించామన్నారు. ప్రస్తుతం ఇళ్లకు సర్వేలో స్టిక్కరింగ్ జరుగుతుందన్నారు. సర్వే ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందన్నారు.

**ప్రధాని కులాన్ని అడిగామా ?**

'ప్రధాని నరేంద్రమోదీ ఏం కులమో తాము అడిగామా..? రాహుల్‌గాంధీ కులాన్ని అడిగేందుకు బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఎవరు' అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర నిర్వహించిన సందర్భంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని ప్రకటించారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కుల గణన చేస్తుంటే బీజేపీ పార్టీ అక్కసును వెళ్లగక్కుతోందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణనకు బీజేపీ పార్టీ వ్యతిరేకమన్నారు. రాహుల్‌గాంధీ కులాన్ని ప్రశ్నించడం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వ్యక్తిగతమా..? లేక బీజేపీ సిద్ధాంతమా..? తెలపాలని పొన్నం ప్రశ్నించారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుద్ధి, జ్ఞానం లేని వాళ్లు రాహుల్‌గాంధీ కులం గురించి ప్రశ్నిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేస్తే ఎవరి కులం ఏమిటో బయట పడుతుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కులగణనకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఏఎస్‌వో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, నాయకులు పిడిశెట్టి కనకయ్య, ఎదులాపురం తిరుపతి, పొన్నాల మురళీ పటేల్, బీపీటీ అయిలయ్య, పోచయ్య, నాగరాజు, చెప్యాల ప్రకాష్, స్వర్ణలత, కంకల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన మహిళ మృతి


సోని(ఫైల్)

డోర్నకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన డోర్నకల్ మునిసిపల్ పరిధిలోని రాజుతండాలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం. రాజుతండాకు చెందిన లావుడ్యా సురేష్-సోని (36) దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. దంపతులిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈనెల 1న సురేష్ కూలీ నులకు వెళ్లకుండా మద్యంతాగి ఇంటి వద్దనే ఉన్నాడు. ఈ లోగా ఖమ్మంలోని వసతిగృహంలో చదువుకుంటున్న పిల్లల వద్దకు వెళ్లి వచ్చిన సోని కూలీ పనులకు ఎందుకు వెళ్లలేదని భర్త సురేష్‌ను మందలించింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కోపోద్రికురాలైన సోని ఒంటిపై డీజిల్ పోసుకుని భర్తను బెదరించేందుకు యత్నించగా, మద్యం మత్తులో ఉన్న సురేష్ అగ్గిపెట్టే వెలిగించడంతో ఆమెకు మంటలు అంటుకున్నాయి. వెంటనే పొరపాటు గ్రహించిన సురేష్ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతడి చేతులు కూడా కాలి గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు సోనీని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోని మృతి చెందింది. మృతురాలికి భర్త సురేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలు సోని ఇచ్చిన వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్ తెలిపారు.



## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆస్పత్రి ఆవరణలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. గుర్తు తెలియని వ్యక్తి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణలో కిందపడిపోయి ఉన్నాడని చెప్పారు. సుమారు అతని వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని జిల్లా మార్చురీలో భద్రపరిచామని చెప్పారు. మృతుని సమాచారం కోసం సెల్ : 87126 56930, 87126 56933లను సంప్రదించాలన్నారు.

దంతాలపల్లి పీఏసీఎస్ అధికారులపై

## పొంగులేటి ఆగ్రహం

- కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ వెంకన్న సస్పెన్షన్‌కు ఆదేశం

దంతాలపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ కొనుగోలు సెంటర్ వద్ద ఉన్న ఇన్‌చార్జి వెంకన్న విధుల్లో నిర్లక్ష్యంగా వహించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆయనపై సస్పెన్షన్ వేటు వేయాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న వెంకన్న విధుల్లో నిర్లక్ష్యంగా వహించడంతో ఆయనపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే తేమశాతాన్ని చూసి వెంటనే కాంటా పెట్టాలన్నారు. ధాన్యం సెంటర్‌లో సన్న, దొడ్డురకం కొనుగోలును వేరువేరు ప్రాంతాల్లో చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆగ్రహానికి లోనయ్యారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్, చైర్మన్ రాము, సీఈవో వెంకన్న, తాజామాజీ ఎంపీటీసీ యాకన్న, మాజీ సర్పంచ్ రవీందర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

తొర్రూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులోని మిషన్ భగీరథ విశ్రాంతి భవనంలో జనగామ, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌లు, ఆయాశాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లకు దొడ్డురకం, సన్నరకాలకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించాలని, పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అభివృద్ధి పనులను పూర్తి చేస్తూ రెండు పడకగదుల ఇండ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. పాలకుర్తి పరిధిలో ఇరిగేషన్, రిజర్వాయర్‌లు, కెనాల్ మరమ్మతులు, ఉపాధి హామీలో పెండింగ్ పనులు, సీసీ రోడ్లకు ప్రతిపాదనలు రెండు జిల్లాల పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలల మంజూరుకు స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ ఆక్రమణలను గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రజలకు విద్యుత్, తాగునీరు, విద్య, ఆరోగ్యం తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జనగామ కలెక్టర్ రిజ్వాన్ పాషషేక్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు రాంచంద్రు నాయక్, యశస్విని రెడ్డి, మురళి నాయక్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

పెద్దవంగర, నవంబర్7 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. పెద్దవంగరలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం ఏ గ్రేడ్ రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300, సన్నరకానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన పెద్దవంగర మండలాన్ని నియోజకవర్గంలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో స్వామినాయక్, ఏపీఎం రమణాచారి, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జాటోత్ నెహ్రూనాయక్, మురళి, శ్రీనివాస్, వెంకన్న, ముత్యాల పూర్ణచందర్, సీతారామ్‌నాయక్, లింగమూర్తి, గోపాల్, ఉప్పలయ్య, వేణు, శ్రీనివాస్, హరికృష్ణ, యాకన్న, సతీష్, సైదులు, సమ్మయ్య వినోద్, పవన్ పాల్గొన్నారు.

# నిధులను వెంటనే విడుదల చేయాలి

- మునిసిపల్ వైస్ చైర్మన్ వెంకన్న

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మానుకోట మునిసిపాలిటీకి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) శ్రీదేవికి గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ మానుకోట మునిసిపాలిటీ పరిధిలో రూ.7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వైకుంఠధామాలు నిర్మించి పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. అందులో రూ.3.20 కోట్ల స్టేట్ గ్రాంట్ నిధులు విడుదల కానందున మునిసిపాలిటీ నిధుల నుంచి రూ.1.90 కోట్లను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు చెల్లించడం జరిగిందన్నారు. ఆ నిధులను వీలైనంత త్వరగా విడుల చేయాలని ఆయన కోరారు. అలాగే మహబూబాబాద్ మునిసిపాలిటీకి రావాల్సిన సుమారు రూ.6 కోట్ల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీని విడుదల చేయాలని, పట్టణ ప్రగతి నిధులను విడుదల చేయాలని కోరారు. మునిసిపాలిటీ పరిధిలో ఎస్‌డీఎఫ్ కింద సుమారు రూ.20 కోట్ల పనులు చేపట్టడం జరిగిందని, ఆ నిధులు కూడా ఇంకా విడుదల కాలేదని వాటిని త్వరగా విడుదల చేసి మానుకోట అభివృద్ధికి సహకరించాలని మార్నేని వెంకన్న కోరారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం నేత సీతారాంనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ శివారు ఏటి గడ్డ తండాలో సీపీఎం శాఖ మహాసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.....రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని కోరారు.ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏటిగడ్డ తండా శాఖ కార్యదర్శిగా బానోత్ ప్రకాశ్, సహాయకార్యదర్శిగా బానోత్ సుమన్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి రావుల రాజు, హేమానాయక్, బానోత్ సిజ్జిరాం, రాములు, దయాకర్, చిన్న పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### శతాధిక వృద్ధురాలి మృతి


కమలమ్మ (ఫైల్)

డోర్నకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని కుందోజువారి వీధికి చెందిన శతాధిక వృద్ధురాలు పసందుల కమలమ్మ (106) వృద్ధాప్యంతో వచ్చిన అనారోగ్య కారణాలతో గురువారం స్వగృహంలోనే మృతి చెందారు. కమలమ్మకు 8మంది సంతానం కాగా, అందులో ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు గతంలో మృతి చెందారు. 2019 పార్లమెంట్ ఎన్నికల ముందు డోర్నకల్ పట్టణంలో సీనియర్ ఓటరుగా ఉన్న కమలమ్మను గుర్తించిన ప్రభుత్వ అధికారులు ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కమలమ్మ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

### కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కళాకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ప్రజానాట్యమండలి (పీఎన్ఎం)జిల్లా కార్యదర్శి నక్క సైదులు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం పీఎన్ఎం జిల్లా కమిటీ సమావేశాన్ని అల్వాల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు నూనె శ్రీనివాస్, బోర స్వామి, నాగరాజు, మచ్చ వెంకన్న, నరేందర్, హరిత, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

### లంబాడీల మాతృభాషగా గోర్‌బోలిని చేర్చాలి

కేసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : లంబాడీల జాతి మాతృభాషగా గోర్‌బోలిని చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు దస్రునాయక్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో గురువారం లంబాడీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దస్రునాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కులగణన కుటుంబ సర్వే జరుగుతున్న సందర్భంగా యావత్ తెలంగాణలోని లంబాడీ జాతి కులం వారు తమ మాతృభాషగా గోర్‌బోలిగా చేర్చుకోవాలని సూచించారు.

### పద్మశాలీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్



మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మరిపెడ పట్టణానికి చెందిన దిగిజర్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకంటి రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర సహాయ కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులకు ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంఘ బాధ్యులు ఆయనను అభినందించారు.

### రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజన్‌బాబు



కొత్తగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తగూడకు చెందిన కుసుమ రాజన్‌బాబు ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలలో భాగంగా కుసుమ రాజన్‌బాబును ఎన్నుకున్నట్లు ఆసంఘం బాధ్యులు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాజన్‌బాబును పలువురు అభినందించారు.

### బీఎస్పీకి పరశురాములు రాజీనామా

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బీఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఐనాల పరశురాములు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి లేఖ పంపించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పని చేసినప్పటికీ తగిన గుర్తింపు లభిస్తలేదన్నారు. దీంతో మనస్తాపానికి గురై రాజకీయాలకు గుడ్‌బై చెప్పి స్నేహపూరిత సంబంధాలతో పని చేస్తానని చెప్పారు. తనకు సహకరించిన కార్యకర్తలకు, పెద్దలకు కృతజ్ఞతలు చెప్పారు.

### ఎన్ఏఎస్ పరీక్షను పక్కాగా నిర్వహించాలి

కొత్తగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రాజేశ్వర్ సూచించారు. మండలంలోని వేలుబెల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల, పోలారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను డీఈవో గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంపీవో ఆజాద్, ఎంఈవో గుమ్మడి లక్ష్మీనారాయణ, సీఆర్పీ ఉపేందర్ పాల్గొన్నారు.

### పేదల పక్షాన సమరశీల పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి


ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంచుతున్న విజయసారథి

గార్ల నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా పేదల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పార్టీ సమరశీల పోరాటం చేస్తుందని జిల్లాకార్యదర్శి బి.విజయ సారథి అన్నారు. గురువారం గార్లలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించి, కార్యకర్తలకు అందజేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, వెంకటనర్సమ్మ, దార్ల నగేష్, నాగరాజు, రమేష్, వీరారెడ్డి, చిరంజీవి, సరిత, లాలు, సుశీల, నీలమ్మ, పద్మ పాల్గొన్నారు.

### బాస్కెట్ పోటీలకు రాజోలు విద్యార్థులు

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజోలు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు అండర్-14 విభాగంలో బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జర్పుల లక్షిత, బి.రాజేష్ ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు కె.వెంకట్‌రెడ్డి, బి.దామోదర్, డి.మోహన్, కె.బీకు, వంగ సురేష్, రవికుమార్, రాజేశ్వరి, కిషన్, వసంత, భవాని, సతీష్‌కుమార్ అభినందించారు.

## వుషూలో జాతీయస్థాయికి కల్వల కావ్య ఎంపిక

కేసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కల్వలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భూక్య కావ్య వూషూ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం బండారు నరేందర్, పీడీ కొప్పుల శంకర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 26 వరకు జమ్ములో నిర్వహించే జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఏఎంసీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అంభినందించారు.

### రాష్ట్రస్థాయికి క్రీడలకు యోగీశ్వర్

ఈనెల 8 నుంచి 10 వరకు కొంపల్లిలో నిర్వహించే బాస్కెట్ బాల్ పోటీలకు కల్వల మోడల్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి యోగిశ్వర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నవీన్, పీడీ లలిత తెలిపారు. విద్యార్థి యోగిశ్వర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### ఖోఖో పోటీలకు ముఖేష్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా తాండూరులో ఈ నెల 15,16,17 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కారం ముఖేష్ ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం విష్ణువర్ధన్ గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయికి ముఖేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, ఉప్పలయ్య, సోహెన్, శ్రీనివాసరావు, తిరుపతి, శిఖారాణి, సోమేశ్వర్, ఝాన్సీ అభినందించారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కేసీఆర్ కుటుంబం తడిగుడ్డతో గొంతు కోయాలని ప్రయత్నిస్తే.. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు, రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో ఎలా గుణపాఠం నేర్పారో తెలుసుకదా అన్నారు. గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు ఎందుకు తడుముకుంటున్నావు కేటీఆర్, తెలంగాణ ప్రజలకు నువ్వు చేసిన తప్పేంటో తెలుసు, పడబోయే శిక్షలు కూడా తెలుసు. చట్టం తన పనితాను చేసుకుంటూపోతుందని, ఎవరూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డిని, వైస్ చైర్మన్ భట్టునాయక్‌ను శాలువాతో సత్కరించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

### ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని రాంచంద్రునాయక్ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గతంలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసి, పేద ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంరైతులకు ఉచిత కరంటు, మహిళలకు ఫ్రీ బస్సు, రూ.500లకే గ్యాస్, పెన్షన్‌లు, అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. డిసెంబర్ 9లోగా రుణమాఫీ పూర్తిచేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ అమెరికాలో వేలకోట్ల ఆస్తులను వదులకుని వచ్చి పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

### మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తా

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని, నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇండ్లతో పాటుమరో 1,000 ఇండ్లు అదనంగా మంజూరు చేయాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. తాము తాటాకు చప్పుళ్లకు భయపడమని, నియోజకవర్గంలో పదేళ్ల నియంత దొరల పాలన సాగిందని, స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ గెలుపుకోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్, చీఫ్ విప్ రాంచంద్రు నాయక్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, తొర్రూరు, నెల్లికుదురు, దంతాలపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొలిక్కివచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

ఝవేలం పాటలు పూర్తయి 'విన్నర్ లీస్ట్' విడుదల అవుతున్నప్పటికీ కాంటాలు ప్రారంభం అయ్యే సరికి సాయంత్రం 3, 4 గంటలు అవుతోంది. ఆలస్యంగా కాంటాలు ప్రారంభం కావడంతో రాత్రి వరకు కొనసాగడంవల్ల రైతులు రాత్రివేళలో తమ గ్రామాలకు వెళ్లాల్సివస్తోంది. కార్మికుల విభజన చేస్తే మార్కెట్లో దడువాయిల మాదిరిగా కూలీలు, హమాలీలు వ్యవహరించే అవకాశం ఉంటుందని కార్మిక నాయకులు చెబుతున్నారు. అంతేకాకుండా వేలం పాటలు పూర్తికాగానే వెంటనే కాంటాలు నిర్వహించే వీలుంటుందని మార్కెట్లోని వివిధ వర్గాలు చెబుతున్నాయి.

అయితే దడువాయిల మాదిరిగా పెద్ద సంఖ్యలో ఉన్న మార్కెట్లోని కార్మికులందరికీ సమానంగా పనికల్పించడం, కూలీ డబ్బులను పంచడం పెద్దసవాల్‌గా మారనుంది. మరోవైపు మార్కెట్లో కాకుండా బయట వ్యాపార సంస్థల వద్ద ఖరీదులు పెరిగాయి. వ్యాపార సంస్థల వద్ద అధికంగా బీహార్ కార్మికులతో పనులు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌కు వచ్చే సరుకు మధ్యలోనే దారిమళ్లుతూ కార్మికులకు పని తగ్గుతోంది. ఈ క్రమంలో విభజన అనంతరం 'మార్కెట్ కార్మికులకు' కూలి గిట్టుబాటు అవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా సంక్లిష్టమైన కార్మికుల విభజన సమస్య నూతన పాలకమండలికి సవాల్‌గా మారింది. ఈసారైనా విభజన సమస్య పరిష్కారం అవుతోందో లేదోనని మార్కెట్లోని ఆయా వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.


## 'ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అశా వర్కర్లపై పనిభారాన్ని తగ్గించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి రేషపల్లి నవీన్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ పుచ్చకాయల రజిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ అనుబంధ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో అర్బన్ పీహెచ్‌సీలో గురువారం వినతి పత్రాన్ని అందించారు.వెలుగు శ్రావణ్, రమా, ఉపేంద్ర, మాధవి, మహేశ్వరీ, విజయ, రమాదేవి, కళావతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

నెల్లికుదురు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మేచరాజుపల్లి పాఠశాలలో అవినీతి నిర్మూళనపై కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు కెనరాబ్యాంక్ చీఫ్‌మేనేజర్ నర్సింహరావు బహుమతులు డిక్షనరీలు ప్యాడ్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు మంగతాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'సర్వేను సద్వినియోగం చేసుకోవాలి'


వెన్నం శ్రీకాంత్‌రెడ్డి ఇంటికి స్టిక్కర్ వేస్తున్న సర్వే సిబ్బంది

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజలుసద్వినియోగం చేసుకోవాలని రెడ్యాల మాజీ సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాలలో గురువారం ఇంటింటి సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు శ్రీకాంత్ రెడ్డి ఇంటికి స్టిక్కరింగ్ వేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే చేసేందుకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విక్రమ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్

## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్

మరిపెడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం గుండెపుడిలో 9వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ముందుగా అదే గ్రామానికి చెందిన మృతి చెందిన సీపీఎం శ్రేణులకు నివాళులర్పించారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. నియోజకవర్గంలో ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అల్వాల వీరయ్య, దుండి వీరన్న, జిన్నా లచ్చయ్య పాల్గొన్నారు.

## జీరో దందాను అరికట్టాలి : సీపీఐ

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలాంటి మార్కెటింగ్ ట్రేడింగ్ లైసెన్స్‌లు లేకుండా జీరో దందా చేస్తున్న పత్తి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్‌లుడిమాండ్ చేశారు. తూకంలో అమాయక రైతులను మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. గురువారం ఆ పార్టీ స్థానిక నాయకులతో కలిసి జీరో దందా పత్తి వ్యాపారంపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కరణ, వీరేందర్, వెంకన్న ఉన్నారు.

## లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలి

పెద్దవంగర, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం కళాధర్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న గంగిశెట్టి రమేష్‌కుమార్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. విద్యార్థులకు తమవంతు సాయం అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన ఉపాధ్యాయుడు గంగిశెట్టి రమేష్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, నరసింహారావు, శ్రీనివాస్, సురేందర్, సింహాద్రి, సమ్మయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి

దంతాలపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇష్టపడి చదివి బంగారు భవిష్యత్‌ను ఎంచుకోవాలని మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వేణుమాధవ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెకుముకి టాలెంట్ పరీక్ష పత్రాలను విడుదల చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రవి, రజినీదేవి, మంజుల, రమేష్ పాల్గొన్నారు.

## డీసీఎం, ఆటో ఢీకొని వ్యక్తి మృతి

తొర్రూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి తొర్రూరు శివారు ఎర్రసోమ్లాతండా వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం. వర్ధన్నపేటకు చెందిన మహ్మద్ రహీం తన మిత్రుడి ఆటోలో పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎర్రసోమ్లా తండా వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టడంతో మహ్మద్ రహీం (47) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## అదనంగా ఆపరేటర్లను నియమించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ డివిజన్ పరిధిలో ఆర్టిసన్స్ ద్వారా నడుపబడుతున్న 33/11 సబ్ స్టేషన్‌లో నలుగురు చేయాల్సిన ఆపరేటింగ్ విధులను ఇద్దరు మాత్రమే చేస్తున్నామని, అదనంగా ఆపరేటర్లను నియమించాలని తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పడాల శ్రీనివాస్, కార్యదర్శి పాము వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం డీఈ విజయ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు ఏజెన్సీ అలవెన్సులు కల్పించాలన్నారు. వీలైనంత త్వరగా ప్రతి సబ్‌స్టేషన్‌లో ముగ్గురు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన విద్యుత్ డీఈ విజయ్‌కుమార్ వారం రోజుల్లోగా సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవుల శ్రీనివాస్, రవిశేఖర్, మసూద్‌పాషా, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లో విద్యుత్ డీఈ విజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది